RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 309 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | ఆదివారం, 12 మే 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# అతివల 'ఆదరణ' హస్తానికే!

## ఉచిత బస్సు, ఫ్రీ కరెంట్, 500కు సిలిండర్, డ్వాక్రా రుణాల వడ్డీ మాఫీ కలిసొస్తాయని పార్టీ ఆశలు




### ఆయా స్కీంల కింద 1.50 కోట్ల మంది లబ్ధిదారులు

### మహిళల్లో ఎక్కువ మంది కాంగ్రెస్ వైపే ఉంటారని అంచనా

### ప్రచారంలో పొలిటికల్ కామెంట్లతో పాటు గ్యారంటీలపైనా ఫోకస్

హైదరాబాద్ : రాష్ట్రంలో వంద రోజుల పాలనలో అమలు చేసిన గ్యారంటీలు పొందిన లబ్ధిదారులు తమకు ఓటుబ్యాంకుగా మారుతారని కాంగ్రెస్ ధీమాతో ఉన్నది. ఇందులో ప్రధానంగా మహిళా ఓటు బ్యాంకు ఎక్కువ మొత్తంలో తమ వైపు మొగ్గుచూపే చాన్స్ ఉందని భావిస్తోంది. రాష్ట్రంలో కోటికి పైగా కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో వివిధ రకాలుగా గ్యారంటీల రూపంలో లబ్ధి జరిగింది. ఇందులో గృహజ్యోతి కింద ఫ్రీ కరెంట్, మహాలక్ష్మి కింద ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటివి ఉన్నాయి. ఇందులో ఉచిత బస్సు ప్రయాణం మినహా మిగతావన్నీ కుటుంబం యూనిట్‌గా లబ్ధి జరుగుతోంది. దీంతో ఆ కుటుంబాలన్నీ కాంగ్రెస్ అభ్యర్థులకు పట్టం కడతాయని ఆశిస్తున్నారు. ముఖ్యంగా మహిళలకు అందుతున్న గ్యారంటీ స్కీంలతో వారి ఓట్లు కాంగ్రెస్ పార్టీకి ఇంకింత అసెట్ అవు తాయని భావిస్తున్నారు. అందులో భాగంగానే ప్రచారంలో ప్రత్యర్థులపై పొలిటికల్ కామెంట్లతో పాటు గ్యారంటీలను ఎక్కువగా ప్రచారం చేస్తున్నారు. మూడున్నర నెలల పాలన రెఫరెండంగానే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి సిద్ధమైనట్లు సీఎం రేవంత్ రెడ్డి కూడా ఇదివరకే ప్రకటించారు.

**ఆ మూడు గ్యారంటీలు కుటుంబాలకే :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత తీసుకువచ్చిన గ్యారంటీలలో మూడింటితో నేరుగా కుటుంబాలకే లబ్ధి జరుగుతోంది. ఇందులో గృహజ్యోతి స్కీం, రూ.500కే సిలిండర్, రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉన్నాయి. గృహజ్యోతి కింద 200 యూనిట్లలోపు జీరో కరెంట్ బిల్లులు అందిస్తున్నారు. దీనికింద రాష్ట్రంలో దాదాపు 42 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. ఎన్నికల కోడ్ తరువాత మరిన్ని కుటుంబాలకు ఈ స్కీం వర్తించనుంది. దీనితో గ్రామాల్లో, పట్టణాల్లో పేద కుటుంబాలు మేలు జరుగుతోంది. ప్రతినెలా కరెంట్ బిల్లులు చెల్లించాల్సిన భారం తప్పిందని అనుకుంటున్నారు. అదే సమయంలో రూ.500కు గ్యాస్‌సిలిండర్ కూడా 40 లక్షల కుటుంబాలకు లబ్ధి జరుగుతోంది. ఈ లబ్ధిదారుల సంఖ్య కూడా మరింత పెరగనుంది. రాజీవ్ ఆరోగ్యశ్రీ 91 లక్షల కుటుంబాలకు వర్తింపజేశారు. ఈ మూడింటి నుంచి యావరేజ్ గా కోటి కుటుంబాలకు నేరుగా లబ్ధి జరుగుతోంది.

**మహిళా ఓటు బ్యాంకు కాంగ్రెస్ వైపే..** ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే మహిళలకు ఉచి త బస్సు ప్రయాణం ప్రారంభించారు. ఈ గ్యారంటీకి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పటివరకు ఆర్టీసీ దా దాపు 40 కోట్ల జీరో టికెట్లు ఇచ్చింది. అంటే రాష్ట్రంలోని మహిళలు అన్ని సార్లు ప్రయాణం చేశారు. కొం తమంది రెగ్యులర్ గా వెళ్లే ప్రయాణికులు ఉండగా.. అవసరాల మేరకు వివిధ ప్రాంతాలకు వెళ్లే మహిళలు కూడా ఉంటున్నారు. ఇక డ్వాక్రా సంఘాల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. 63 లక్షల మంది సభ్యులతో ఉన్న మహిళా సంఘాలకు ఒక్కో గ్రామ సమాఖ్య పరిధిలోని సంఘాలకు రూ.కోటి రుణం ఇవ్వాలని నిర్ణయించింది. స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులెవరైనా సరే.. ప్రమాదవశాత్తూ లేదా సహజంగా మరణిస్తే గ్రూప్ నుంచి ఆమె తీసుకున్న రుణం మాఫీ చేసేందుకు ప్రత్యేక రుణ బీమా పథకం అమలు చేస్తున్నారు. ఇప్పటికే ఆ పార్టీ చేయించిన ఇంటర్నల్ సర్వేల్లోనూ గ్యారంటీల అమలుతో మహిళలవైపు నుంచి పాజిటివ్ టాక్ వచ్చిందని తెలిసింది.

**ప్రచారంలోనూ గ్యారంటీల హోరు :** లోక్‌సభ ఎన్నికల ప్రచారంలోనూ గ్యారంటీల అమలుపై విస్తృతంగా క్యాంపెయినింగ్ చేస్తున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రాంతాల్లో హోర్డింగ్స్, మెట్రో పిల్లర్లపై ప్రకటనలు వేయించారు. ఇక ప్రచారంలో అభ్యర్థులతో పాటు సీఎం, మంత్రులు గ్యారంటీలను ప్రస్తావిస్తున్నారు.

పొలిటికల్ కామెంట్లు ఊపు తెచ్చినా.. గ్యారంటీలతో ఆలోచింపజేస్తామని అంటున్నారు. గ్రామాల్లో గ్యారంటీలపై చర్చలు జరిగేలా చూడాలని రేవంత్ రెడ్డి క్యాడర్‌కు ఇప్పటికే స్పష్టం చేశారు.

# రేపు వేతనంతో కూడిన సెలవు

హైదరాబాద్ : తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలు, సికింద్రాబాద్ కంటోన్‌మెంట్ ఉప ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సెలవుల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మే 13న వేతనంతో కూడిన సెలవు ఇస్తున్నట్లు ప్రకటించింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నిక పోలింగ్ మే 13న జరగనుంది. ఇదే రోజు తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలు కూడా జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దేశవ్యాప్తంగా మొత్తం ఏడు దశల్లో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు జూన్ 4న జరగనుంది.

ఈ ఉత్తర్వులను అమలు చేయాలని జిల్లా కలెక్టర్లకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఈ సెలవు నిబంధనలను కచ్చితంగా అన్ని కంపెనీలు, సంస్థలు అమలు చేయాలని వెల్లడించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని, లేదంటే తమకు ఫిర్యాదు చేయాలని అధికారులు కోరారు. అయితే ఎన్నికల్లో ఓటర్ల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.




# కాంగ్రెస్, బీజేపీ ఎంపీ అభ్యర్థుల్లో సీనియర్ లీడర్ల ధీమా

## క్యాడర్ కు బూస్టింగ్ ఇచ్చేందుకే..


## ఇంటర్నల్ మీటింగ్స్ లోనూ ఇదే ప్రచారం

## సంజయ్, అరవింద్, ఈటల, జీవన్ రెడ్డి, బలరాం నాయక్ ఆశలు

కరీంనగర్ : లోక్ సభ ఎన్నికల్లో గెలిస్తే ఈ సారి కేంద్ర మంత్రి పదవి ఖాయమని రాష్ట్రంలో కొందరు కాంగ్రెస్, బీజేపీ ఎంపీ అభ్యర్థులు ధీమాతో ఉన్నారు. కేంద్రంలో ఈ దఫా కచ్చితంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ఇక్కడ తనను గెలిపిస్తే కేంద్ర మంత్రి కావడం ఖాయమని కొందరు కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారం చేసుకుంటున్నారు. అలాగే, బీజేపీ ఎంపీ అభ్యర్థులు కూడా కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని, తమను రెండోసారి గెలిపిస్తే సెంట్రల్ మినిస్ట్రీ ఖాయమని సిట్టింగ్ ఎంపీలు చెప్పుకుంటున్నారు. ఇదే విషయాన్ని వారి అనుచరులు కూడా ప్రచారంలో పెట్టడం చర్చనీయాంశంగా మారింది.

**ఆశల్లో సీనియర్లు..** కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తమకు యూనియన్ కేబినెట్ లో బెర్త్ కన్ఫామ్?అనే విశ్వాసంతో ఆ పార్టీ నిజామాబాద్ అభ్యర్థి జీవన్ రెడ్డి, మహబూబాద్ అభ్యర్థి బలరాం నాయక్ ఉన్నట్లు తెలిసింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆ పార్టీలో సీనియర్ నేతగా గుర్తింపు ఉన్న జీవన్ రెడ్డికి రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రి పదవి దక్కుతుందనే చర్చ కాంగ్రెస్ శ్రేణుల్లోనూ జోరుగా సాగుతోంది. అలాగే గతంలో కేంద్ర మంత్రిగా పని చేసిన బలరాం నాయక్ మరో సారి మహబూబాబాద్ నుంచి పోటీ చేస్తున్నారు. ఈ సారి ఆయన గెలిస్తే మళ్లీ మంత్రి అవుతారనే ప్రచారం జరుగుతోంది. బీజేపీ అభ్యర్థుల విషయంలోనూ ఇదే రకమైన చర్చ నడుస్తోంది. కరీంనగర్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న బండి సంజయ్ మరోసారి ఇదే స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాష్ట్రంలో పార్టీ బలో పేతమయ్యేందుకు తీవ్రంగా కృషి చేశారనే పేరుంది. దీంతో సంజయ్ రెండో సారి గెలిస్తే తప్పకుండా కేంద్ర మంత్రి పదవి దక్కుతుందని ఆ పార్టీ శ్రేణులు ప్రచారం చేస్తున్నాయి. నిజామాబాద్ అభ్యర్థి ధర్మపురి అరవింద్, మేడ్చల్ మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్ కూడా తాము గెలిస్తే కేంద్రంలో మంత్రి పదవో, సహాయ మంత్రి పదవో ఖాయమనే ధీమాతో ఉన్నట్లు తెలిసింది.

**ఉత్సాహాన్ని నింపేందుకు...** వాస్తవానికి కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే విషయంలో క్లారిటీ లేదు. ఏయే పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయనే విషయం ఫలితాలు వస్తేగానీ తెలియదు. ప్రభుత్వ ఏర్పాటులో భాగస్వామ్యమయ్యే పార్టీలను బట్టి మంత్రి పదవుల అడ్జస్ట్ మెంట్ ఉంటుంది. దీంతో ఏ రాష్ట్రానికి ఎన్ని మినిస్ట్రీలు వస్తాయి.. అవి ఎవరికి వస్తాయనే విషయంలో స్పష్టత లేదు. లీడర్లు మాత్రం తమ క్యాడర్‌లో ఉత్సాహం నింపేందుకు, ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు సెంట్రల్ మినిస్టర్ పదవి అస్త్రాన్ని వాడుతున్నారనే చర్చ సాగుతోంది.




# కార్మికులే డిక్టేటర్లు!

## ఎంపీ ఎన్నికల్లో ఇండస్ట్రియల్ ఓటర్లే అధికం

## అత్యధికంగా పటాన్ చెరు సెగ్మెంట్ లో 4,10,170 ఓటర్లు

## ప్రధాన పార్టీల అభ్యర్థుల మూలాలు ఇక్కడే

# గెలుపోటముల డిసైడింగ్ వీరిదే..

సంగారెడ్డి : మెదక్ పార్లమెంట్ పరిధిలో అభ్యర్థుల గెలుపోటములపై పటాన్ చెరు అసెంబ్లీ సెగ్మెంట్ ప్రభావం చూపనుంది. సంగారెడ్డి, మెదక్, నర్సాపూర్, గజ్వేల్, దుబ్బాక, సిద్ధిపేట నియోజకవర్గాల కంటే పటాన్ చెరు సెగ్మెంట్ లో అత్యధిక ఓటర్లు నమోదై ఉన్నారు. పైగా మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులకు పటాన్ చెరుతో సంబంధం ఉండడమే కాకుండా వారి మూలాలు ఇక్కడే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు, కాంగ్రెస్ క్యాండిడేట్ నీలం మధు, బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి పటాన్ చెరు నియోజకవర్గంపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ సెగ్మెంట్ ఇండస్ట్రియల్ ఏరియా కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు ఇక్కడే స్థిరపడుతుండడంతో ఓటర్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇందులో ఎక్కువగా ఉద్యోగులు, కార్మికులే ఉండడంతో అభ్యర్థులు వారిపైనే ఫోకస్ పెట్టి ప్రచారాస్త్రాలు సంధిస్తున్నారు.

**ఓటర్లు 4,10,170 మంది :** జనవరిలో విడుదల చేసిన ఓటర్ జాబితా ప్రకారం పటాన్ చెరు అసెంబ్లీ సెగ్మెంట్ లో 4,10,170 ఓటర్లు ఉన్నారు. మిగతా 6 నియోజకవర్గాలతో పోలిస్తే ఓటర్ల సంఖ్య ఇక్కడ ఎక్కువగా ఉంది. మెదక్ ఎంపీగా ఎవరు గెలవాలన్నా పటాన్ చెరు ఓటర్లే కీలకమవుతున్నారు. ఈ క్రమంలో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు వివిధ ప్రయత్నాలు చేస్తున్నారు. ఎక్కువగా పటాన్ చెరు, తెల్లాపూర్, అమీన్పూర్, ఇస్నాపూర్, రుద్రారం, గుమ్మడిదల, జిన్నారం ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థులు నేరుగా ఇంటింటికీ తిరిగి ఓట్లు అడిగే పరిస్థితి లేకపోవడంతో ప్రధాన కూడళ్లు, కాలనీలు, అపార్ట్?మెంట్ల పరిధిలో ఉండే ఓటర్లను కలుస్తూ ప్రచారం కొనసాగిస్తున్నారు. పార్టీలోని సెకండ్ క్యాడర్ లీడర్లు, కార్యకర్తలు క్యాండిడేట్ల తరఫున ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పటాన్ చెరు నియోజకవర్గ ఓటర్లు ఏ పార్టీ వైపు మొగ్గు చూపిస్తారనేది ఆసక్తిగా మారింది.

**ఆ ముగ్గురు ఇలా..** మెదక్ లోక్ సభ ఎన్నికల బరిలో నిలిచిన మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులకు పటాన్ చెరు అసెంబ్లీ సెగ్మెంట్ తో సత్సంబంధాలు ఉన్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు స్వగ్రామం పటాన్ చెరు మండలం చిట్కుల్. ఆ గ్రామ పంచాయతీ సర్పంచ్ గా మధు ఏకగ్రీవంగా ఎన్నికై స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో మంచి ఇమేజ్ సంపాదించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ నుంచి పోటీ చేసినప్పటికీ వ్యక్తిగత ఇమేజ్ తో 40 వేల పైచిలుకు ఓట్లు సాధించి కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపించారు. ఈ క్రమంలోనే సర్పంచ్ నుంచి ఎంపీగా పోటీ చేసే స్థాయికి ఎదిగారు. బీఆర్ఎస్ క్యాండిడేట్ వెంకట్రామిరెడ్డి సంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ గా పనిచేసి పటాన్ చెరు ఓటర్లకు సుపరిచితుడిగా ఉన్నారు. పైగా ఇతను ఇదే నియోజకవర్గంలోని తెల్లాపూర్ లో స్థిరనివాసం ఏర్పాటు చేసుకొని స్థానిక పొలిటికల్ లీడర్లతో సంబంధాలు కలిగి ఉన్నారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు విషయానికి వస్తే ఆయన రాజకీయ ప్రస్థానం పటాన్ చెరు నుంచే మొదలైంది. పాత్రికేయుడిగా, న్యాయవాదిగా పనిచేయడంతో ఆయనకు స్థానికంగా పరిచయాలు బాగానే ఉన్నాయి. తెలంగాణ ఉద్యమం టైంలో పటాన్ చెరు నుంచి రాజకీయులు చేసి దుబ్బాక ఎమ్మెల్యేగా ఎదిగారు. అయితే వీరిని పటాన్ చెరు నియోజకవర్గ ఓటర్లు ఏ మేరకు ఆదరిస్తారనేది తెలియాల్సి ఉంది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## మహిళలు ప్రధాన కేంద్రంగా ఎన్నికలు..

## చరిత్రలో ఈ స్థాయిలో తొలి

జనాభాలో సగం.. అవకాశాల్లో సగం.. ఉద్యోగాల్లో సగం.. అంటూ మహిళా లోకం భారత దేశంలో కొన్ని దశాబ్దాలుగా గళమెత్తుతోంది. మారుతున్న కాలానికి తగినట్లు మహిళలు కూడా చైతన్యం అవుతున్నారు. గత మూడు దశాబ్దాల్లోనే ఎంతో ముందుకెళ్లారు. అంతెందుకు..? ప్రస్తుతం పార్టీలన్నీ కూడా మహిళలకు మ్యానిఫెస్టో తీసుకొస్తున్నాయి. కుటుంబంలో కీలక వ్యక్తి అయిన ఆమెను ఓటు బ్యాంకుగా గాక.. ఫలితాన్ని నిర్దేశించే శక్తిగా చూస్తున్నాయి. ఇక దాదాపు 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న మహిళా రిజర్వేషన్ బిల్లుకు మెజారిటీ పార్టీలు ఆమోదం తెలపడం ఈ ఏడాదిలో చోటుచేసుకున్న గొప్ప పరిణామం అని చెప్పాలి. ఇక తెలుగు రాష్ట్రాల సంగతికి వస్తే తెలంగాణలో ప్రస్తుతం లోక్ సభకు, ఏపీలో లోక్ సభ, అసెంబ్లీకి కలిపి ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో గమనించాల్సినది ఏమంటే.. మహిళలు ప్రధాన కేంద్రంగా ఈ ఎన్నికలు నడుస్తుండడం.

**తెలంగాణ బరిలో ఆమె లేరు..** బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేకుండానే ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్నాయి. ఢిల్లీ మద్యం కేసులో అరెస్టయిన కవిత దాదాపు రెండు నెలలుగా తిహాడ్ జైల్లోనే ఉన్నారు. 2014లో ఎంపీగా నిజామాబాద్ నుంచి గెలిచి 2019లో ఓడిన కవిత ఈసారి ఎన్నికలకు ముందే అరెస్టయ్యారు. ఒకవేళ బయట ఉండి ఉంటే నిజామాబాద్ లో పోటీ చేసేవారా? లేదా? అనేది తర్వాతి సంగతి. అయితే, తమ కుమార్తెను అన్యాయంగా అరెస్టు చేశారంటూ కేసీఆర్ ఎన్నికల ప్రచార సభల్లో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మరోవైపు కవిత సోదరుడు కేటీఆర్ కూడా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తున్నారు.

**ఏపీలో కీలకంగా..** ఏపీ రాజకీయాలకు వస్తే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సోదరి వైఎస్ షర్మిల అనూహ్యంగా ఆ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు అయ్యారు. ఆమె ప్రస్తుత ఎన్నికల్లో కడప నుంచి పోటీ చేస్తున్నారు కూడా. ఇక షర్మిల తన బాబాయ్ వివేకానందరెడ్డి హత్యను పదేపదే ప్రస్తావిస్తూ, ఆయన కూతురు డాక్టర్ సునీతారెడ్డితో కలిసి ప్రచారంలో పాల్గొంటున్నారు. అనివార్యం అయినప్పటికీ షర్మిల రాజకీయ ప్రయాణాన్ని అన్న జగన్ ప్రస్తావించాల్సి వస్తోంది. మరోవైపు వివేకా హత్య కేసులో షర్మిల తన వదిన వైఎస్ భారతిని కూడా ప్రశ్నిస్తున్నారు. వైఎస్ వివేకా భార్య సౌభాగ్యమ్మ కూడా ఈ ఎన్నికల సందర్భంగా బయటకు రావడం గమనార్హం. కాగా, ఎన్నికల్లో తన భర్త వైఎస్ జగన్ తరఫున భారతి పులివెందులలో ప్రచారం చేస్తున్నారు. మొత్తానికి ఏపీ రాజకీయాల్లో షర్మిల, సునీతారెడ్డి, భారతి ప్రధాన కేంద్రంగా మారారు. ఏపీలో ఉమెన్ సెంట్రిక్ గా ఎన్నికలు... గతంలో ఎన్నడూ లేని విధంగా జరుగుతున్నాయి.

**జాతీయ స్థాయిలో..** కాంగ్రెస్ అగ్ర నేత ప్రియాంక గాంధీ ఈ ఎన్నికల్లో గతంలో కంటే చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఆమె తెలంగాణ నుంచి పోటీ చేస్తారనే కథనాలు వచ్చాయి. కానీ, అదేమీ లేకుండా.. రాయ్ బరేలీలో తన అన్న గెలుపునకు ప్రచారం చేస్తున్నారు. శనివారం తెలంగాణ ఎన్నికల ప్రచారంలో పాల్గొనున్నారు.

**అగ్ర నేత లేకుండానే..** 25 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉన్నారు. రాయ్ బరేలీ సిటింగ్ ఎంపీ అయిన ఆమె అనారోగ్యం కారణంగా ఈసారి పోటీ చేయడం లేదు. కాగా, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సొంత రాష్ట్రంలో శక్తినంతా ధారపోస్తున్నారు. జాతీయ పార్టీ అయినప్పటికీ బీఎస్పీ అధినేత్రి మాయావతి ఉత్తరప్రదేశ్ కే పరిమితం అయ్యారు.

# గజిబిజిగా ఓటరు జాబితా




కరీంనగర్ : వావిలాలపల్లిలోని పోలింగ్ కేంద్రంలో ఉండాల్సిన ఓటర్లు అంబేడ్కర్ రోడ్డు, క్రిస్టియన్ కాలనీలో ప్రత్యక్షమయ్యారు. జాబితాలో ప్రకారం ఇంటి నంబర్లు అక్కడికి ఉండటంతో పోల్‌చీటీలు కూడా అక్కడే పంపిణీ చేసే అవకాశముంది. బూత్‌లలో ఓటర్ల కేటాయింపు సక్రమంగా చేయకపోవడంతో ఒక బూత్‌లో 487 ఓట్లు ఉండగా, మరో బూత్‌లో 1489 ఓట్లు ఉన్నాయి. ఓటేసే సమయంలో ఒక దానిలో రద్దీ ఉండనుంది. రెండింటిలో సమానంగా నిర్ణయించలేదు. నగరవ్యాప్తంగా అత్యధిక శాతం పోలింగ్ కేంద్రాలలో ఇలాగే ఉన్నాయి.

ఇంటినంబర్ ప్రకారం కుటుంబ సభ్యులందరివి ఒకే పోలింగ్ స్టేషన్‌లోని ఒకే బూత్‌లో ఉండాలి. అలాకాకుండా భార్య, భర్త, పిల్లల ఓట్లు వేర్వేరు చోట ఉన్నాయి.

కాపువాడ, పాతబజారు, పద్మశాలీ వీధిలో ఉన్న ఓటర్లు మారుతినగర్‌లోని ఓటరు జాబితా ఉన్నాయి. పోలింగ్ కేంద్రాలు ఎక్కడ ఉంటాయో తెలియక కొందరు ఓటేసేందుకు కూడా అసెంబ్లీ ఎన్నికల్లో రాలేదు.

ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో రాజకీయ పార్టీల నాయకులు ఓటరు జాబితాలు పరిశీలిస్తున్నారు. వారు జాబితాను చూస్తే.. పేర్లు గజిబిజిగా కనిపించాయి. ఓటరు చీటీలు పంపిణీ చేసే వారికి కూడా తలనొప్పిగా తయారైంది. వారం రోజులుగా ఓటర్లను కలుసుకునేందుకు ఆయా ప్రధాన పార్టీల నాయకులు బూత్ కమిటీల వారీగా ఇంటింటికి వెళ్తున్నారు. కొందరి పేర్లు ఉండి, మరికొందరివి కనిపించకపోవడంతో ఓటర్లు ప్రశ్నిస్తున్నారు. మిగతా ఓట్లు ఏ బూత్‌లో ఉన్నాయో తెలుసుకొని చెబుతామని చెప్పి సదరు పార్టీల బాధ్యులు అక్కడి నుంచి జారుకుంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇలాగే ఓటర్ల జాబితా గందరగోళంగా ఉండగా, ప్రస్తుతం కూడా అలాగే ఉందని కార్పొరేటర్లు అంటున్నారు. పార్లమెంట్ ఎన్నికలలో మార్పులు, చేర్పులు ఉంటాయని భావించిన రాజకీయ పార్టీలకు, ప్రజాప్రతినిధులకు సమస్యలు ఎప్పటిలాగే దర్శనమిచ్చాయి. ఈ ఓటరు జాబితా ఎప్పుడు మారుతుందో ఆ అధికారులే తెలియాలంటున్నారు.

ఎప్పటిలాగే ప్రత్యక్షం..

పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితా లేకపోవడం ఒక కారణమైతే, సమీప బూత్‌లలో ఉన్న ఓటర్లు కాకుండా ఇతర బూత్‌లకు సంబంధించిన వారు ఉన్నారు. ఇంటి నంబర్లు, వీధుల పేర్లు ఎక్కడో తెలియకుండా మారింది. కొన్నింటికి అయితే రెండు అంకెల ఇంటి నంబర్లు ఉండటంతో ఏ డివిజన్ ఓట్లు అనేవీ తేల్చుకోలేకపోతున్నారు. శాసనసభ ఎన్నికల సమయంలో ఉన్నట్లే ఇంటినంబర్ల స్థానంలో సర్వే నంబర్లు ఉన్నాయి. మరికొందరికి బిల్డింగ్ అని ఉంది. ఇలాంటి వాటిని రెవెన్యూ అధికారులు పరిశీలించి మార్చకపోవడంతో అలాగే జాబితాలో ముద్రితమవుతున్నాయి.

అదనంగా అయిదు కేంద్రాలు

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో మొత్తం 390 పోలింగ్ కేంద్రాలు ఉండగా, లోక్‌సభ ఎన్నికల కోసం అదనంగా అయిదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. రూరల్ మండలంలో దూరంగా ఉన్న వాటిని ఓటర్ల దగ్గరికి మార్చినట్లు సమాచారం. ఇంకా 19 పోలింగ్ కేంద్రాలను అటు ఇటుగా మార్చారు. వీటిని ఓటర్లు దగ్గర ఉన్న ప్రాంతానికి విభజించారు. ఓటరు చీటీలో పోలింగ్ కేంద్రం, చిరునామా, రూట్ మ్యాప్ ప్రచురించి ఇచ్చారు. దాని ఆధారంగా ఓటర్లు పోలింగ్ రోజున ఓటు వేసే వీలుంది.

# ప్రచార ఉపాధి



కరీంనగర్ : జెండాలు వేరైనా జిందాబాద్ పలికే గొంతులు అవే.. కండువాల రంగు వేరైనా అక్కడా, ఇక్కడా ప్రదర్శనగా వెళ్లేది వాళ్లే.. ఒకచోట సభ.. మరో చోట రోడ్‌షో.. ఇంకో చోట కూడలి సమావేశం.. ఇలా పార్టీ ఏదైనా, పేరేదైనా ప్రచారంలో వాళ్లే ముందుంటున్నారు. 'ఫలానా అభ్యర్థికి ఓటేయమ'ంటూ నినదిస్తారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పార్టీ కార్యకర్తల కంటే మహిళలే ఎక్కువగా కనిపిస్తున్నారు. మండుటెండలను సైతం లెక్క చేయకుండా ప్రచార కార్యక్రమాల్లో ముందుంటూ ఉపాధి పొందుతున్నారు.

అతివలే అధికం

రోడ్‌షోలు, కార్నర్ సమావేశాలు, బహిరంగ సభలు, ఇంటింటి ప్రచారం, పోల్ చీటీల పంపిణీ.. కార్యక్రమాల్లో ఎక్కువగా మహిళలే పాల్గొంటున్నారు. కొద్ది రోజులుగా ఎండలు మండుతుండటంతో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అన్ని పార్టీలు ఇంటింటి ప్రచారానికి ప్రాధాన్యమిస్తున్నాయి. బూత్‌ల వారీగా నిధులతో పాటు ప్రచార సామగ్రి సమకూరుస్తున్నారు. ప్రతి బూత్ పరిధిలో స్వశక్తి సంఘాల ప్రతినిధుల ద్వారా మహిళలను ప్రచారానికి రప్పిస్తున్నారు. ఇంటింటి ప్రచారానికి ఉదయం, సాయంత్రం వేర్వేరుగా డబ్బులు చెల్లిస్తున్నారు.

ఇంటి ఖర్చులకు పనికొస్తాయని..

ఒక్కోసారి ప్రచారానికి రూ.200 నుంచి రూ.300 చెల్లిస్తున్నారు. పార్టీ ముఖ్య నేతలు వచ్చినపుడు మంగళహారతితో స్వాగతం పలికితే రూ.1500 నుంచి రూ.2 వేలు చెల్లిస్తున్నట్లు సమాచారం. ఇక రోడ్‌షోలకు రూ.300, బహిరంగ సభలకు వెళ్తే రూ.400, వాహనంతో పాటు భోజనం, తాగునీటి వసతి, తిరిగి ఇళ్ల వద్దకు చేర్చడం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇళ్లలో పని చేసుకునే మహిళలతో పాటు నిరుపేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. 'వేసవి సెలవుల్లో పిల్లలు ఇంట్లో ఉన్నందున వారి ఖర్చుల కోసం ఉపయోగపడతాయని, ఎండ పెరగకముందే వెళ్లి వస్తున్నా'మని మహిళలు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. సాధారణంగా కొందరు ఉదయం ఒక పార్టీ తరఫున, సాయంత్రం మరో పార్టీకి మద్దతుగా ప్రచారానికి వెళ్తున్నట్లు వివరించారు.

సభలకు, ర్యాలీలకు పురుషులు

ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీల అగ్ర నేతలు హాజరయ్యే బహిరంగ సభలకు మాత్రం పురుషులను తీసుకెళ్తున్నారు. బైక్ ర్యాలీలు వంటి వాటికి యువతకు ప్రాధాన్యమిస్తున్నారు. వీరికి కూడా తగినంత చెల్లిస్తున్నారు. బైక్ ర్యాలీకి వెళ్లే వాహనాల్లో పెట్రోల్ కూడా ప్రచార బాధ్యులే పోయిస్తున్నారు. మొత్తం మీద ప్రచార 'ఉపాధి' ఈ నెల 11 వరకు కొనసాగనుంది.

# ఆధ్యాత్మిక క్షేత్రంలో ఆధునిక వైద్య సేవలేవీ!



ధర్మపురి: ఆధ్యాత్మిక క్షేత్రంగా అభివృద్ధి చెందుతున్న ధర్మపురి పట్టణంలో మెరుగైన వైద్యసేవలు అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడి ముప్పై పడకల ఆసుపత్రిలో పది పడకల ఐసీయూ కేంద్రానికి మోక్షం కలగడం లేదు. ఈ ఆసుపత్రిలో అత్యవసర సేవల కోసం ఎలాంటి వసతులు లేవు. ధర్మపురి, బుగ్గారం, వెల్గటూర్, బీర్‌పూర్ మండలానికి చెందిన వందమంది రోగులు ఓపీ సేవలు పొందుతున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో ఇక్కడికి తరలి వస్తున్నారు. జాతీయ రహదారి కావడంతో రాత్రిళ్లు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. 108 వాహనం ద్వారా జగిత్యాల ఏరియా, ఇతర ఆసుపత్రులకు క్షతగాత్రులను తరలిస్తున్నారు. అత్యవసర సేవలు అందక ఎంతోమంది ప్రాణాలు విడిచిన ఘటనలు ఉన్నాయి. ధర్మపురిలో అత్యవసర వైద్య సేవలందించాలంటే ఐసీయూ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉందని భావించి అప్పట్లో రూ.కోటి నిధులు మంజూరు చేశారు. ఈ కేంద్రంలో పది ఐసీయూ పడకలు ఏర్పాటు చేస్తున్నారు. పడకలతో పాటు, అత్యాధునిక పరికరాలు రావాల్సి ఉంది. అత్యవసర వైద్య సేవలను అందుబాటులోకి తీసుకుని రావాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నికల తర్వాత ఏర్పాటుకు చర్యలు

–శ్రీకాంత్, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్, ధర్మపురి ఆసుపత్రి

ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రిలో ఐసీయూ కేంద్రం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు బీరువాలు, యంత్రాలు వచ్చాయి. మిగతా పరికరాలు ఎన్నికల తర్వాత వచ్చే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన సిబ్బందిని కూడా నియమిస్తారు. ఎన్నికల తర్వాత ప్రక్రియ ప్రారంభమవుతుందని భావిస్తున్నాం.

# నీటికుంట.. తీర్చును తంటా!

భూదాన్‌పోచంపల్లి : నీటి నిల్వ సాంద్రత పెరిగేలా ఉపాధి హామీ పథకంలో కమ్యూనిటీ ఫారం పాండ్స్ (నీటి కుంటలు) నిర్మాణం చేపడుతున్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేలా అటవీ ప్రాంతాలు, ప్రభుత్వ స్థలాల్లో నీటి కుంటల నిర్మాణం చేపడితే.. భూగర్భ జలాలు పెరగడంతో పాటు అడవిలోని జంతువులు, పక్షులకు, చెట్లకు సరిపడా నీరు అందనుంది. ఉపాధి హామీ పథకం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 2,923 ఫారం పాండ్స్(నీటి కుంటల) నిర్మాణ పనులు చేపట్టారు.

కూలీలకు ఉపాధి..

నీటి కుంటల నిర్మాణం చేపట్టడంతో నీటి నిల్వలు, నీటి విస్తీర్ణం పెరగడంతో పాటు భూగర్భ జలాలు వృద్ధి చెందుతున్నాయి. వరద నీరు నిల్వ ఉండటంతో భూసారం దెబ్బతినకుండా ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో వేసవిలో స్థానికంగా పనులు లేకపోవడంతో కూలీలకు ఉపాధి కోసం వలసలు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఈ పథకం ద్వారా కూలీలకు సరిపడా పనులు కల్పించినట్లవుతుంది.

గ్రామసభల్లో తీర్మానం..

జిల్లా వ్యాప్తంగా 17 మండలాల్లో 2,997 నీటి కుంటల నిర్మాణం లక్ష్యంగా కాగా 2,923 నిర్మాణ పనులు పూర్తికాగా, మరికొన్ని వివిధ




దశల్లో ఉన్నాయి. నీటి కుంటలను ఏ ప్రదేశంలో నిర్మిస్తే వరద నిల్వ ఉంటుంది, ఎక్కడ నిర్మిస్తే జంతువులతో పాటు, పశువులు, జీవులకు అవసరం అవుతుందనేది గ్రామసభల్లో తీర్మానం చేస్తారు. అనంతరం అటవీ శాఖ అనుమతులతో నిర్మాణం చేపడుతున్నారు.

జల సంరక్షణతో ప్రయోజనం

కమ్యూనిటీ వాటర్ హార్వెస్టింగ్(నీటి సేకరణ) ఫారం పాండ్స్(నీటి కుంటలు) నిర్మాణంలో అటవీ ప్రాంతాల్లో జలసంక్షరణ, భూగర్భ జలాలు పెరగడంతో పాటు జీవాలకు నీరు అందుతుంది. వృక్ష సంపద వృద్ధి చెందుతుంది. జిల్లా వ్యాప్తంగా వివిధ దశల్లో నీటి కుంటల నిర్మాణ పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. కృష్ణన్, డీఆర్డీవో, యాదాద్రి భువనగిరి జిల్లా.

# ఈవీఎంల కేటాయింపు పూర్తి

ఆలేరు : భువనగిరి లోక్‌సభ స్థానం ఎన్నికకు 39 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 2,141 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో పోలింగ్ కేంద్రానికి మూడు బ్యాలెట్ యూనిట్లు అవసరం అవుతున్నాయి. మరో నాలుగు రోజుల్లో పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సామగ్రి కేటాయింపు పనులు చివరి దశకు చేరాయి. నియోజకవర్గంలో 25 శాతం బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను అదనంగా అందుబాటులో ఉంచారు. భువనగిరి లోక్‌సభ స్థానానికి ఈ నెల 13న జరగనున్న ఎన్నికకు ఈవీఎంల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. భువనగిరి లోక్‌సభ స్థానం పరిధిలో ఏడు శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. మొత్తం 2,141 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఈవీఎంల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. మొత్తం 8,023 బ్యాలెట్ యూనిట్లు, 2,673 కంట్రోల్ యూనిట్లు, 2,994 వీవీ



ప్యాట్లను కేటాయించారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లను 20 శాతానికిపైగా, వీవీ ప్యాట్లను 40 శాతం వరకు అదనంగా అందుబాటులో ఉంచారు.

సెగ్మెంట్ల వారీగా స్ట్రాంగ్ రూమ్‌లు

భువనగిరి: అరోరా హయ్యర్ ఎడ్యుకేషన్ కళాశాల, భువనగిరి
నకిరేకల్: ప్రభుత్వ జూనియర్ కళాశాల, నకిరేకల్
తుంగతుర్తి: వ్యవసాయ మార్కెట్ గోదాం, తుంగతుర్తి
ఆలేరు: ఇండోర్ స్టేడియం, ఆలేరుమునుగోడు: డాన్‌బాస్కో జూనియర్ కళశాల, చండూరు జనగామ: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జనగామ ఇబ్రాహీంపట్నం: గురునానక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ క్యాంపస్, ఖానాపూర్

# నోటా.. వచ్చిందిలా

భూదాన్‌పోచంపల్లి : ఓటు హక్కును వినియోగించుకోవడం అందరి బాధ్యత. నచ్చని అభ్యర్థులు పోటీలో ఉన్నప్పుడు తమ అభిప్రాయాన్ని వ్యక్తీకరించే అవకాశం లేకపోవడం వల్ల రకరకాల పద్ధతుల్లో గతంలో తమ వ్యతిరేకతను తెలిపేవారు. కొందరు లేఖలు రాసి, మరికొందరు పోటీలో ఉన్న అభ్యర్థులందరికీ ఓటు వేసి, ఇంకొందరు బ్యాలెట్ పత్రంలో ఎవ్వరికీ ఓటు వేయకుండా ఖాళీగా ఉంచి నిరసన వ్యక్తం చేసేవారు. నచ్చని అభ్యర్థులు రంగంలో ఉన్నప్పుడు తమ అభిప్రాయాన్ని వ్యక్తీకరించే అవకాశం ఓటరుకు ఇవ్వాలని దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు వెలువరించింది. దీన్ని అనుసరించి ఎన్నికల సంఘం నోటా (నన్ అఫ్ ది ఎబోవ్)తో ఆ అవకాశాన్ని కల్పించింది. ఈ పద్ధతి 2013 నుంచి అమలులోకి వచ్చింది. అదే సంవత్సరం ఎన్నికలు రావడంతో మొదటిసారి దిల్లీ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో నోటాను అమలు చేశారు. ఇలాంటి నోటా విధానం ప్రస్తుతం 13 దేశాల్లో అమలులో ఉంది.

చెల్లని ఓట్లకు చెల్లు చీటీ..ఓటింగ్ ప్రక్రియలో ఈవీఎంలను ప్రవేశపెట్టడంతో చెల్లని ఓట్లకు కాలం చెల్లింది. ఓటరు అభ్యర్థి గుర్తు పక్కనున్న మీటాను నొక్కాలి. ఎవరూ నచ్చకపోతే నోటా మీటా నొక్కే సౌకర్యం ఉంది. గతంలో బ్యాలెట్ పేపరుపై స్వస్తిక్ ముద్ర వేసే పద్ధతి ఉండేది. ఈ క్రమంలో ముద్ర సరిగ్గా పడకపోవడం, ఇద్దరి గుర్తులపై ముద్ర వేయడం, ముద్ర వేయకుండానే బ్యాలెట్ పేపరును బాక్స్‌లో వేయడం వల్ల వాటిని చెల్లని ఓట్లుగా గుర్తించేవారు. ప్రస్తుతం ఈవీఎంలు రావడం వల్ల చెల్లని ఓట్లు అనే సమస్య లేకుండా పోయింది.

# డిజిటల్ మాధ్యమం.. విస్తృత ప్రచారం

గోదావరిఖని : ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో చైతన్యం తెస్తూ పోలింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం విస్తృతంగా ప్రచారం చేస్తోంది. జన బాహుళ్యంలో ఉండే మాధ్యమాల ద్వారా ఓటు ప్రాధాన్యతను వివరిస్తోంది. ఇప్పటికే ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు, పలు రకాల పోటీలు, విద్యా సంస్థల్లో నమూనా పోలింగ్ నిర్వహణతో పాటు సామాజిక మాధ్యమాలతో ప్రచారం నిర్వహిస్తున్నారు. రైల్వే, బస్ స్టేషన్లు, తపాలా కార్యాలయాలు, బ్యాంకులతో పాటు ఇతర కార్యాలయాల్లోనూ ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ గోడప్రతులు ఏర్పాటు చేశారు. ఇటీవలి కాలంలో డిజిటల్ చెల్లింపులు పెరిగిన నేపథ్యంలో ప్రతి చెల్లింపు తర్వాత యాప్‌లో ఓటు హక్కు వినియోగంపై ఓ ప్రచార పోస్టరు కనిపిస్తోంది. ప్రజలు అత్యధికంగా ఉపయోగించే ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా




ఓటు హక్కు వినియోగంపై అవగాహన కలిగిస్తున్నారు. ఫోన్‌పేలో సగర్వంగా ఓటేద్దాం ÃŸ%slets vote withpride%) అనే నినాదం ఆకట్టుకుంటోంది.

ప్రలోభాలు వీడండి.. నిజాయతీ చాటండి

న్యూస్‌టుడే, ధర్మపురి: మద్యం, డబ్బు వంటి ప్రలోభాలకు లొంగకుండా నిజాయతీగా ఓటు వేయాలని కోరుతూ పెద్దపల్లి లోక్‌సభ స్థానం నుంచి బరిలో ఉన్న పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి మోతె నరేశ్ బుధవారం ధర్మపురిలో వినూత్న ప్రచారం నిర్వహించారు. 'కాళ్లు మొక్కుతా.. ప్రలోభాలకు లొంగిపోయి అయిదేళ్ల జీవితాన్ని తాకట్టు పెట్టవద్ద'ంటూ మెడలో మద్యం సీసాలు, డబ్బు నమూనా చిత్రాలు వేసుకొని ప్లకార్డులతో పలు కూడళ్ల వద్ద దుకాణదారులకు, ద్విచక్రవాహనదారులకు విన్నవించారు.

# కలిసొచ్చిన బాస్మతి... హరియాణాకు ఎగుమతి

వీర్నపల్లి : కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు, మిల్లర్ల కోతలతో విసుగు చెందిన కర్షకులు బాస్మతి రకం వరి సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. యాసంగిలో వ్యవసాయ క్షేత్రాల్లో పంటను పండిస్తూ ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. తాలు, తరుగుతో సంబంధం లేకుండా పచ్చి ధాన్యాన్ని ఇంటి వద్దే అమ్ముకుంటున్నారు. దిగుబడి తక్కువగానే ఉన్న సమయంతోపాటు ధర కలిసొస్తుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో 40 మంది రైతులు సుమారు వంద ఎకరాలకు పైగా బాస్మతి ధాన్యం పండిస్తున్నారు. దొడ్డు రకం, సన్న రకంతో పోలిస్తే పక్షం రోజుల మందుగానే పంట చేతికొస్తుంది. దీంతో చివరి దశలో నీరు అందించేందుకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వడం లేదని రైతులు అంటున్నారు. నాలుగేళ్లుగా సాగుతో పెట్టుబడులు పోను ఆశించిన ఆదాయం వస్తుందని చెబుతున్నారు. మార్కెటింగ్ కోసం హరియాణాకు చెందిన ఓ వ్యక్తితో ఒప్పందం కుదుర్చుకున్నారు.

ఇంటి వద్దే కాంటాలు...

యాసంగిలో సన్నరకం పండించేందుకు రైతులు అంతగా ఆసక్తి చూపరు. దొడ్డు రకం ధాన్యం పండించడంతో కొనుగోలు కేంద్రాలకు ఒక్కసారిగా ధాన్యం పోటెత్తుతున్నాయి. దీంతో కాంటాలకు అధిక



సమయం పడుతుంది. తాలు తొలగించినప్పటికీ తరుగు పేరిట కొంత అనధికారికంగా తూకం పరిపాటిగా మారింది. ఈ మూస పద్ధతిని వీడి బాస్మతి సాగుకు ఇక్కడి రైతులు ముందుకొస్తున్నారు. వంగడాలను హరియాణా నుంచి తెచ్చుకుని ఇక్కడ సాగు చేస్తున్నారు. పంట చేతికొచ్చిన మూడు రోజుల్లోపే ఇంటివద్దే పచ్చిగాఉన్నధాన్యాన్ని సైతం తూకాలు వేస్తున్నారు. ఎకరాకు 20 క్వింటాళ్ల నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని కర్షకులు చెబుతున్నారు. తాలు తరుగు సాకుతో కోతలు విధించడం లేదు. అలాగే హమాలీ డబ్బులను సైతం సదరు వ్యక్తులే చెల్లిస్తున్నారు. రూ. 2,600 ధర పలుకుతుందని అన్నదాతలు పేర్కొంటున్నారు. తూకం వేసిన 48 గంటల్లోపు రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమవుతున్నాయి.

నాలుగేళ్లుగా సాగు చేస్తున్నా

– పతారి పద్మయ్య, వీర్నపల్లి

నాలుగేళ్ల క్రితం ఓ వ్యక్తి సలహాతో ఇక్కడ బాస్మతి సాగు చేశాను. నాతోపాటు ఇరుగు పొరుగు రైతులు సైతం పంటను వేశారు. ఇంటి వద్దకే వచ్చి కాంటాలు వేస్తున్నారు. మూడు ఎకరాల విస్తీర్ణంలో 70 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. తూకం వేసిన రెండు రోజుల్లో డబ్బులు ఖాతాల్లో జమవుతున్నాయి. బాస్మతి సాగుతో మాకు బాగానే గిట్టుబాటు అవుతుంది.

# సమయం లేదు మిత్రమా..!



వికారాబాద్ : సార్వత్రిక సమరం (2024) చివరి అంకానికి చేరుకుంది. ఇక మిగిలింది కేవలం 2 రోజులే కావడంతో అభ్యర్థులు 'సమయం లేదు మిత్రమా' అంటూ శ్రేణులను ఓటర్ల చెంతకు పరుగులు పెట్టిస్తున్నారు. తమవంతు ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు.

గ్రామానికి ఇద్దరు బాధ్యులు

ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్ల వివరాలను ఇప్పటికే నాయకులు సేకరించారు. వారిని రప్పించి ఓటు బలాన్ని పెంచుకోవాలని ప్రధాన పార్టీలు వ్యూహాన్ని రచిస్తున్నాయి. ఇప్పటికే గ్రామానికి ఇద్దరు చొప్పున బాధ్యులను నియమించారు.

మీకేం కావాలంటే అది..

గత అసెంబ్లీ ఎన్నికల్లో పడిన ఓట్ల ఆధారంగా, ఆయా ప్రాంతాలపై ప్రధాన పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఓటర్లు ఎక్కడుంటే అక్కడికే వెళ్లి ఒక్కో ఓటరుకు ప్రత్యేకంగా సమయమిచ్చి తమవైపు తిప్పుకునే విధంగా చేయాలని గ్రామస్థాయి నేతలను ఆదేశిస్తున్నారు. 'మీకేం కావాలో చెప్పండి.. లేదా మా నాయకుడితో ఏం పని చేయించాలో చెప్పండి.. ఎన్నికలు ముగియగానే చేయిస్తాం' అంటూ ప్రధాన పార్టీల నాయకులు హామీలు ఇచ్చి నేతలతో ఫోన్లో నేరుగా మాట్లాడిస్తున్నారు. ముఖ్యంగా మహిళా సంఘాలను సమావేశపరిచి ఓటు తమ పార్టీకే వేయాలంటూ ప్రసన్నం చేసుకుంటున్నారు.

హెూరాహెూరీ పోరు..

చేవెళ్ల బరిలో 43 మంది అభ్యర్థులున్నా ప్రధానంగా కాంగ్రెస్ నుంచి గడ్డం రంజిత్‌రెడి, భాజపా నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, భారాస తరఫున కాసాని జ్ఞానేశ్వర్‌ల మధ్యే హెూరాహెూరి పోరు నెలకొంది. పరిగిలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, తాండూరులో ఎమ్మెల్యే బుయ్యని, వికారాబాద్‌లో స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నీ తానై పార్టీ శ్రేణులను సమన్వయ పరుస్తూ ముందుకు కదులుతున్నారు.

భాజపా అభ్యర్థికి మద్దతుగా రాష్ట్ర భాజపా కార్యవర్గ సభ్యుడు మిట్ట బాలకృష్ణారెడ్డి, నాయకులు ప్రహ్లాదరావు, బాలకృష్ణారెడ్డిలు కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేస్తున్నారు.

భారాస అభ్యర్థికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్, పైలెట్ రోహిత్‌రెడ్డి, కొప్పుల మహేశ్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అండగా నిలిచి ప్రచారం చేస్తున్నారు.

మైనార్టీ ఓటర్లకు గాలం పట్టణ ప్రాంతాలైన తాండూరు, పరిగి, వికారాబాద్‌లో ముస్లిం, మైనార్టీ ఓటర్లను తమవైపు మళ్లించుకునేందుకు నాయకులు ప్రతి రోజు వారి నివాసా ప్రాంతాలకు వెళ్లి ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. అవసరమైన సదుపాయాలు కల్పిస్తాం.. మీ ఓట్లు మా పార్టీకే వేయాలి.. వేయించాలి అని మాట తీసుకుంటున్నారు. జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో మైనార్టీ ఓట్లు గత అసెంబ్లీ ఎన్నికల్లో కీలకమై గెలుపు ఓటమిని నిర్ణయించిన నేపథ్యంలో ఈసారి వారి ఓట్లు తమ పార్టీకే పడేందుకు పట్టణ ప్రాంత నాయకులు శతవిధాలా యత్నిస్తున్నారు.

# నాలాల్లో తేలుతున్న ప్రాణాలు



హైదరాబాద్: వానలు మొదలవడంతోనే.. మంగళవారం ఇద్దరు అమాయకులు బేగంపేట వద్ద నాలాలో పడి చనిపోయారు. వర్షాకాలం పూర్తయ్యే నాటికి ఇలాంటి దారుణాలు ఎన్ని చోటుచేసుకుంటాయో అనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇంజినీర్ల నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణమవుతోందనే విమర్శలొస్తున్నాయి. నాలా నిర్మాణ పనులు, పూడికతీత, నాలా సేఫ్టీ ఆడిట్, భద్రతా చర్యల పేరుతో రూ.కోట్ల ప్రజాధనాన్ని కొందరు అవినీతి ఇంజినీర్లు దారి మళ్లిస్తున్నారు. సద్వినియోగం అవ్వాల్సిన నిధులు.. వ్యక్తుల జేబుల్లోకి వెళ్తున్నాయి. సాఫీగా సాగిపోవాల్సిన వరద.. జనాలను బలి తీసుకుంటోంది. రూ.కోట్లు ఖర్చవుతున్నా, ప్రభుత్వాలు మారుతున్నా.. పరిస్థితిలో ఏ మాత్రం మార్పు రావట్లేదు.ప్రమాదాలకు కారణాలివే.. రూ.985కోట్ల అంచనా వ్యయంతో మూడేళ్ల కిందట వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం(ఎస్ఎన్‌డీపీ) మొదలైంది. సుమారు రూ.650 కోట్లు ఖర్చయ్యాయి. కానీ.. పూర్తయిన పనులకు, చేసిన వ్యయానికి ఏమాత్రం పొంతన లేదనే విమర్శలొస్తున్నాయి. నాలా తవ్వుతుంటే బండరాళ్లు అడ్డొచ్చాయని, గుట్టలను తొలగించామని, ఎక్కువ ఇనుము వాడామని.. కొందరు ఇంజినీర్లు భారీగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినట్లు స్థానికులు గగ్గోలుపెడుతున్నారు. రాంనగర్, సికింద్రాబాద్, బాగ్‌లింగంపల్లి, తదితర ప్రాంతాల్లో నాలా పనులు.. ఆశించిన ఫలితం ఇవ్వట్లేదని వాపోతున్నారు.

నాలా సేఫ్టీ ఆడిట్ పేరుతోనూ అవినీతి..

కొన్నేళ్ల కిందట మల్కాజిగిరిలోని ఓ వీధిలో ఆడుకుంటున్న చిన్నారి నాలాలో పడి, పక్కనున్న బండ చెరువులో శవమై తేలి ంది. దానిపై నగరవ్యాప్తంగా ఆందోళనలు రేగాయి. పరిస్థితిని అదుపు చేయడంలో భాగంగా నాలాల పొడవునా సేఫ్టీ ఆడిట్ చేపడతామని, ఓపెన్ నాలాలను గుర్తించి పైకప్పు లేదా జాలీలను ఏర్పాటు చేస్తామని, నాలా ప్రమాదాలను నియంత్రిస్తామని జీహెచ్ఎంసీ ప్రకటించింది. అయితే.. సేఫ్టీ ఆడిట్ మొక్కుబడిగా మారింది. ఈ ఏడాదిలో చేపట్టిన సేఫ్టీ ఆడిట్ నత్తనడకన సాగుతోంది. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించడంలో అధికారులు, ప్రైవేటు కన్సల్టెన్సీలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. బేగంపేట నాలా మీదుగా వెళ్లే రైల్వే ట్రాకు వద్ద జీహెచ్ఎంసీ భద్రత చర్యలు తీసుకోకపోవడం వల్లనే మంగళవారం రాత్రి నాలా ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు వాపోయారు.

నాలాల పూడికతీత మే మొదటి వారానికి పూర్తవ్వాలి. పనులు అయ్యింది మాత్రం 54శాతమే. 952.71కి.మీ నాలాల్లో 3.8లక్షల క్యూబిక్ మీటర్ల వ్యర్థాలను రూ.56.38కోట్లతో వెలికి తీయాలని జోన్లవారీగా పనులు చేపట్టగా, ఇప్పటి వరకు 2.09క్యూబిక్ మీటర్ల పూడికతీత మాత్రమే జరిగింది.

# ఉపాధి.. బతుకులు సమాధి

హైదరాబాద్ : నాలుగు రోజుల క్రితమే నగరానికి ఉపాధి కోసం వచ్చిన కుటుంబం.. ఎన్నికల్లో ఓటు వేసేందుకు త్వరలోనే సొంతూళ్లకు వెళ్దామనుకుని సిద్ధం చేసుకున్న దంపతులు.. తాము కష్టపడి పిల్లలకు మంచి జీవితం ఇవ్వాలని కలలుగన్న తల్లిదండ్రులు.. కళ్లు మూసి తెరిచేలోపు అందరి బతుకులు కుప్పకూలిపోయాయి. బాచుపల్లిలోని కౌసల్య కాలనీలో గోడకూలిన ఘటనలో మృతుల నేపథ్యం కంటతడి పెట్టించింది. ప్రమాదం అనంతరం గాంధీ ఆసుపత్రి మార్చురీ వద్ద మృతుల గురించి చెబుతూ తోటి కార్మికులు కన్నీరుమున్నీరుగా విలపించారు.వేదన వారి మాటల్లో..

మూడ్రోజుల క్రితమే వచ్చి..: ఘటనలో మరణించిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన రాము యాదవ్ కుటుంబం మూడు రోజుల క్రితం నగరానికి వచ్చినట్లు తోటి కార్మికులు చెప్పారు. అక్కడ పని లేకపోవడంతో రాము యాదవ్(44) తన భార్య గీతాబాయి(40) కుమారుడు హిమాన్ష(4)ను తీసుకుని ఆదివారమే నగరానికి వచ్చాడు. బాచుపల్లిలోని రైజ్ డెవలపర్స్ కన్‌స్ట్రక్షన్‌లో కూలీగా చేరి రేకుల షెడ్డులో ఉంటున్నాడు. రాముయాదవ్ షెడ్డులో పడుకున్నాడు. సాయంత్రం తర్వాత గోడ కూలడంతో అతనితోపాటు భార్య, కుమారుడు దుర్మరణం చెందారని స్నేహితులు విలపించారు.

ఎన్నికలకు వెళ్దామని.. ఘటనలో మరణించిన వారిలో బింద్రేష్ భవాని చౌహాన్(30), ఆయన భార్య కుషి(20) సొంతూళ్లకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. తాముండే ప్రాంతంలో ఎన్నికల నేపథ్యంలో వెళ్లాలనుకున్నారు. ఇంతలోనే వారు మరణించడం విషాదం నింపింది. కార్మికశాఖ ఆర్థిక సాయం: మృతుల కుటుంబాలకు రూ. 80 వేల చొప్పున ఆర్థికసాయం అందజేసినట్లు కార్మికశాఖ రంగారెడ్డి జోన్



సంయుక్త కమిషనర్ చతుర్వేది బుధవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఐదుగురు.. అబ్దుల్లాపూర్‌మెట్, చందానగర్, పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్‌లో విద్యుదాఘాతంతో ముగ్గురు చనిపోయారు. మొయినాబాద్ మండలం చిన్న మంగళారానికి చెందిన ఓ మహిళ స్వాగత తోరణం పడి, మూసారాంబాగ్ మెట్రో స్టేషన్ సమీపంలో మద్యం మత్తులో వర్షానికి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు.

శిథిల భవనాలను గుర్తించండి

రాబోయే రోజుల్లో ఈదురు గాలులు, కుండపోత వానలు ఉంటాయన్న వాతావరణశాఖ హెచ్చరికతో జీహెచ్ఎంసీ అప్రమత్తమైంది. నగరవ్యాప్తంగా సర్వే చేపట్టి శిథిల భవనాలను గుర్తించాలని, ఇళ్ల స్థితిగతుల ఆధారంగా నోటీసులివ్వడం లేదా ఖాళీ చేయించాలని బుధవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో బల్దియా కమిషనర్ రోనాల్డ్‌రాస్ స్పష్టం చేశారు.

# సింగరేణి కార్మికుల మొగ్గు ఎటు?

గోదావరిఖని : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సింగరేణి కార్మికులు ఎటువైపు మొగ్గు చూపుతారనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. భారీ సంఖ్యలో ఉన్న సింగరేణి కార్మికుల ఆదరణ ఉంటే విజయావకాశాలు ఉంటాయని భావిస్తున్న అభ్యర్థులు వారిని ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. పెద్దపల్లి లోక్‌సభ పరిధిలో అత్యధికంగా ఉన్న సింగరేణి కార్మికులు ఎటు వైపు మొగ్గు చూపితే ఫలితం అటువైపే ఉంటుందన్నది అభ్యర్థుల ప్రగాఢ విశ్వాసం. దీంతో లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ఇతరులు సైతం వారి ఆదరణ పొందేందుకు దృష్టి సారించారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికలు ఉండటంతో ఈలోగా వారిని ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. సాధారణంగా కార్మికులు ఒకసారి నిర్ణయం తీసుకుంటే మొత్తం అదే సరళి ఉంటుండగా ఈసారి ఎవరి వైపు మొగ్గు చూపుతున్నారన్నది అంతుచిక్కడం లేదు. పెద్దపల్లి లోక్‌సభ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా అందులో అయిదు నియోజకవర్గాలు పూర్తిగా సింగరేణి ప్రాంతాల్లోనే ఉన్నాయి. రామగుండం నియోజకవర్గం పరిధిలో ఆర్జీ–1, 2 డివిజన్లు, మంథని నియోజకవర్గం పరిధిలో ఆర్జీ–3 డివిజన్, మంచిర్యాలకు శ్రీరాంపూర్, చెన్నూరులో మందమర్రి, జైపూర్ ప్లాంటు, బెల్లంపల్లి అసెంబ్లీ స్థానానికి బెల్లంపల్లి డివిజన్లు వస్తాయి. మొత్తం ఐదు అసెంబ్లీ స్థానాల్లో 28,829 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరితో పాటు మరో 15 వేల మంది కాంట్రాక్టు కార్మికులున్నారు. సింగరేణి ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలు కలిపితే కనీసం 1.80 లక్షల ఓట్ల వరకు ఉంటాయి. మెజారిటీ ఓట్లు ఎవరికి పడితే వారినే విజయం వరించే అవకాశం ఉండటంతో అభ్యర్థులు ఎక్కువ శాతం సింగరేణి కార్మికులపై దృష్టి సారించారు.

కొత్త గనులతోనే ఉపాధి అవకాశాలు

సింగరేణిలో కొత్త గనులు ఏర్పాటు చేయక చాలా సంవత్సరాలవుతోంది. ప్రస్తుతం కొత్తగా విధించిన నిబంధన ప్రకారం ఓపెన్ టెండర్ ద్వారానే గనులను దక్కించుకునే పరిస్థితి ఉంది. ప్రస్తుతం బొగ్గు ఉత్పత్తి చేస్తున్న గనులన్నీ పాతవి కావడంతో కొద్ది కాలంలోనే అందులో నిక్షేపాలు పూర్తయ్యే పరిస్థితి ఉంది. గనులు మూసివేసే క్రమంలో ఉపాధి అవకాశాలు సైతం సన్నగిల్లుతున్నాయి. కొత్త ఉద్యోగాలు



రావాలంటే నూతన గనులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. సింగరేణి విస్తరించి ఉన్న పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలో కొత్తగా ప్రతిపాదనలో ఉన్న గనులు 10 వరకు ఉన్నాయి. వీటిని ప్రారంభించుకుంటే కనీసం 10 వేల మంది వరకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు. కొత్త గనులు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ప్రస్తుతం కోల్‌బెల్టు ప్రాంతంలో ఉంది. గనులుంటేనే నియోజకవర్గం పరిధిలో ఓటర్లు ఉండే అవకాశం ఉండటంతో భవిష్యత్తులో కొత్త గనుల ఏర్పాటు అత్యవసరంగా మారింది.

కోల్ ఇండియాలో ఆర్థిక ప్రయోజనాలపై వర్తించే ఆదాయ పన్నును యాజమాన్యం భరిస్తుంది. అదే విధంగా సింగరేణిలో సైతం యాజమాన్యం భరించే విధంగా చర్యలు చేపట్టాలన్న డిమాండ్ ఇక్కడి కార్మికుల్లో ఉంది. కార్మికులు సంపాదించిన మొత్తంలో 30 శాతం వరకు ఆదాయ పన్ను కిందే చెల్లించాల్సి వస్తుంది. దీనిని నివారించేందుకు కొంత వరకైనా మినహాయింపునిస్తే బాగుంటుందన్న అభిప్రాయం నెలకొంది.

కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నారు. కోల్ ఇండియాలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు ఇది వర్తింపజేస్తున్నారు. సింగరేణిలో అమలు చేయడం లేదు. దీనిపై అనేక సార్లు కాంట్రాక్టు కార్మికులు సమ్మె చేశారు. జేబీసీసీఐ సమావేశాల్లో చర్చించారు. ఇప్పటి వరకు ఈ అంశంపై ముందడుగు పడలేదు.

# వానాకాలం వరి సాగు జోరు!

కొత్తగూడెం : వర్షాకాలం సాగు ప్రణాళికను జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ముందస్తుగా సిద్ధం చేశారు. గత సీజన్‌తో పోల్చిచూస్తే ఈ సారి వరి విస్తీర్ణం ఎక్కువగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా కురుస్తాయన్న వాతావరణ శాస్త్రవేత్తల అంచనాలకు తోడు కొత్త ప్రభుత్వం వచ్చే సీజన్ నుంచి వరికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. సాధ్యమైనంత మంది అన్నదాతలు వరి సాగుకు మొగ్గుచూ



పుతారని తెలుస్తోంది. జిల్లాలో కిన్నెరసాని, తాలిపేరు, మూకమామిడి, పెదవాగు రిజర్వాయర్లతో పాటు పాములేరు, ముర్రేడువాగు, కిన్నెరసాని నదులు, వాగుల పరీవాహక ప్రాంతాలు, ప్రధాన చెరువుల కింద ఆయకట్టు పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వరితో పాటు ప్రధాన వాణిజ్య పంటల డిమాండ్‌కు తగిన విధంగా విత్తనాల సరఫరాకు చర్యలు చేపడుతున్నారు. పట్టాలు అందిన పోడు భూముల్లో పత్తి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశముంది. ఈ ఏడాది అత్యధికంగా సాగయ్యే పంటల్లో వరి, పత్తితో పాటు మొక్కజొన్న, మిరప రకాలు ఉంటాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబురావు తెలిపారు. 'ప్రస్తుత అంచనా ప్రకారం విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచుతున్నాం. అవసరాన్ని బట్టి ఉన్నతాధికారుల సమన్వయంతో కొరత లేకుండా చూస్తాం. యూరియా, కాంప్లెక్స్ ఎరువులనూ దిగుమతి చేసుకోవాలని డీలర్లకు సూచించాం' అని చెప్పారు.




## పాక్ బాంబులను కొనేవారే లేరు.. : అయ్యర్ వ్యాఖ్యలపై మోదీ సెటైర్

భువనేశ్వర్: లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. పాకిస్థాన్ వద్ద అణుబాంబులు ఉన్నాయని, దాన్ని మనం గౌరవించాలని ఆయన అన్నారు. దీన్ని భాజపా నేతలు తీవ్రంగా ఖండించారు. తాజాగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పందిస్తూ కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. ఆ పార్టీ సొంత ప్రజలనే భయపెట్టాలని చూస్తోందని మండిపడ్డారు. ఒడిశాలోని కందమల్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యర్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. "పాకిస్థాన్ వద్ద అణుబాంబు ఉందని ఆ పార్టీ (కాంగ్రెస్‌ను ఉద్దేశిస్తూ) నేతలు అంటున్నారు. మరి ఆ దేశ ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో తెలుసా? దాన్నుంచి ఎలా బయటపడాలో కూడా వారికి తెలియదు. వారి బాంబులను ఎవరైనా కొంటారేమోనని ఎదురుచూస్తున్నారు. కానీ వాటి నాణ్యత ప్రపంచమంతా తెలుసు కాబట్టి ఎవరూ కొనడానికి ఇష్టపడట్లేదు" అని దాయాదిని మోదీ ఎద్దేవా చేశారు. అలాంటి దేశం పేరు చెప్పి సొంత ప్రజలనే భయపెట్టాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. అనంతరం కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు.

"తరచూ ఉగ్రదాడులు జరిగిన రోజులను ఈ దేశం ఎప్పటికీ మర్చిపోదు. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు ప్రతిఘటించకుండా ఉగ్రవాదానికి పాల్పడిన వ్యక్తులతో కలిసి చర్చలు జరిపారు. ఓటు బ్యాంకును కోల్పోతామన్న భయంతోనే 26/11 దాడుల తర్వాత ఉగ్రవాదంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వారి బలహీన ఆలోచనల వల్ల జమ్మూకశ్మీర్ కొన్ని దశాబ్దాల పాటు ఇబ్బందులకు గురైంది" అని ప్రధాని మండిపడ్డారు. సరిగ్గా 26 ఏళ్ల క్రితం ఇదే రోజు మాజీ ప్రధాని వాజ్‌పేయి హయాంలో పోఖ్రాన్ పరీక్షను దేశం విజయవంతంగా నిర్వహించిందని గుర్తుచేశారు. నాటి ప్రయోగంతో భారత సామర్థ్యం ప్రపంచానికి అర్థమైందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా గెల్చుకోలేదని మోదీ అన్నారు. విజయం కాదు కదా.. కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కదని విమర్శించారు.




## ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మూల్యం చెల్లించబోతోంది: కేసీఆర్

హైదరాబాద్: తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మూల్యం చెల్లించబోతోందని, ఆ పార్టీపై ప్రజల ఆగ్రహంతో ఉన్నారని మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్ అన్నారు. శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పాలనపై మండిపడ్డారు. "రాష్ట్రాభివృద్ధిపై కాంగ్రెస్ తక్కువ దృష్టి పెట్టింది. అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఏయే రంగాల్లో ఏం చేయబోతున్నారో చెప్పలేదు. అమూల్య సమయాన్ని చిల్లర రాజకీయాల కోసం వెచ్చిస్తున్నారు. అసెంబ్లీలో శ్వేత పత్రాలు విడుదల చేసి, ప్రతిపక్షంపై విమర్శలు చేశారు. రాష్ట్ర పురోగతి గురించి అసలు మాట్లాడలేదు. ఆ వైఫల్యమే కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించబోతోంది. ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. అది ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తప్పకుండా కనిపిస్తుంది. రాజకీయ అనుభవంతోనే ఇది చెబుతున్నా. అధికారంలో ఉన్న పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ వస్తే, సరూర్‌నగర్ స్టేడియంలో అభాసుపాలయ్యారు.

మూడు పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించిన జరిగిన సభకు కనీసం మూడు వేల మంది కూడా రాలేదు. సీఎం సభల్లోనూ ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఉన్న చొరవ ఇప్పుడు కనించలేదు. రాష్ట్రం దివాలా తీసిందనే వ్యాఖ్యలు ఏ ముఖ్యమంత్రి చేయడు. అది రాష్ట్రానికి దీర్ఘకాలికంగా ప్రయోజనాలు దెబ్బతీస్తుంది" అని భారాస అధినేత కేసీఆర్ ధ్వజమెత్తారు.

## రిజర్వేషన్ల రద్దుకు భాజపా కుట్ర: రేవంత్‌రెడ్డి

పటాన్‌చెరు: దేశం సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలనే లక్ష్యంతో భాజపా ఈ ఎన్నికల్లో ముందుకెళ్తోందని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను రద్దు చేయాలని కుట్ర చేస్తున్నారన్నారు. రిజర్వేషన్ల రద్దు ప్రాతిపదికన ఎన్నికలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. పటాన్‌చెరులో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు.

50 వేల మెజారిటీతో మధును గెలిపించాలని కోరారు. మతాలు, కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టాలని భాజపా యత్నిస్తోందని రేవంత్ ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలుంటేనే పెట్టుబడులు వస్తాయని, యువతకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ పని చేస్తోందన్నారు. భారాస హయాంలో పటాన్‌చెరు ప్రాంతంలో అభివృద్ధి జరగలేదన్నారు.



మూసీ రివర్ డెవలప్‌మెంట్ ఫ్రంట్‌కు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని రేవంత్‌రెడ్డి ఆరోపించారు.




హైదరాబాద్: లోక్ సభ ఎన్నిక నేపథ్యంలో ఈ రోజు సాయంత్రం 6 గంటల నుంచి తెలంగాణ రాష్ట్రంలో 144 సెక్షన్ అమలవుతోందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ తెలిపారు. నలుగురు కన్నా ఎక్కువ మంది గుమిగూడొద్దని స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్ మీడియాలో ఆరు గంటల నుంచి ప్రచారం చేయొద్దని తేల్చి చెప్పారు. జూన్ 1వ తేది సాయంత్రం 6.30 నిమిషాల వరకు 144 సెక్షన్ ఉంటుందని వివరించారు. లోక్ సభ ఎన్నిక జరిగే మే 13వ తేదీన కొన్ని సంస్థలు సెలవు ఇవ్వడం లేదని తెలుస్తోంది. ఆ రోజు సెలవు ఇవ్వకుంటే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**వెళ్లిపోవాల్సిందే..?** కళ్యాణ మండపాలు, కమ్యూనిటీ హాల్, హోటళ్లలో ఇతర జిల్లాలకు చెందిన వ్యక్తులు వెళ్లి పోవాలని వికాస్ రాజ్ సూచించారు. రేపు, ఎల్లుండి పేపర్లలో ప్రకటనల కోసం ముందస్తు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. 160 కేంద్ర కంపెనీల బలగాలు రాష్ట్రంలో ఇప్పటికే మోహరించాయని వివరించారు. ఇతర రాష్ట్రాల నుంచి 20 వేల పోలీస్ బలగాలు వచ్చాయని పేర్కొన్నారు. ప్రతి పార్లమెంట్ సెగ్మెంట్‌లో రెండు బ్యాలెట్ యూనిట్లు ఉంటాయని వివరించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలో 232 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వికాస్ రాజ్ స్పష్టం చేశారు.

**జీపీఎస్ ఏర్పాటు** ఈవీఎంలు తరలించే వాహనాలకు జీపీఎస్ ఉంటుందని, వాటిని సీఈఓ ఆఫీస్ ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తుందని సీఈవో వికాస్ రాజ్ తెలిపారు. రూ.320 కోట్ల నగదు ఇప్పటి వరకు సీజ్ చేశామని వివరించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై 8600 కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. లక్ష 90 వేల మంది పోలింగ్ విధుల్లో పాల్గొంటున్నారని వివరించారు. వచ్చే 48 గంటల పాటు వచ్చే ఫిర్యాదులపై 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటామని వివరించారు. బల్క్ మెసేజ్‌లు సాయంత్రం 6 గంటల నుంచి ఆపాలని తేల్చి చెప్పారు. లక్ష 88 వేల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఇప్పటి వరకు పోల్ అయ్యాయని తేల్చి చెప్పారు.

## మిగులు బడ్జెట్ రాష్ట్రం అప్పులపాలయ్యింది: అమిత్ షా




హైదరాబాద్: మిగులు బడ్జెట్ రాష్ట్రం ఇప్పుడు అప్పులపాలయ్యిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా విమర్శించారు. గతంలో భారాస అప్పులు చేసినట్లే కాంగ్రెస్ కూడా చేస్తోందని ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పదేళ్లలో తెలంగాణకు రూ.లక్షల కోట్ల నిధులు ఇచ్చామని చెప్పారు. " మరోసారి కేంద్రంలో భాజపా అధికారంలోకి రావడం ఖాయం. తెలంగాణలో 10 ఎంపీ సీట్లు తప్పక గెలుస్తున్నాం. 11 చోట్ల విజయావకాశాలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా 400 సీట్లు వస్తాయని మాకు పూర్తి విశ్వాసం ఉంది. మోదీ ప్రధానిగా ఉంటేనే దేశం సురక్షితంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. మోదీ పాలనలో ఉగ్రవాద దాడులు లేవు. తెలంగాణలో రామగుండం ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ నిర్మించాం. సమ్మక్క- సారక్క గిరిజన విశ్వవిద్యాలయం మంజూరు చేశాం. ఇలా ఎన్నో కీలక సంస్థలను నెలకొల్పాం. తెలంగాణ ప్రభుత్వ స్టీరింగ్ ఇప్పటికీ ఓవైసీ చేతిలోనే ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలుకావడం లేదు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామన్నారు. అదీ లేదు. రైతు భరోసా కింద రూ.15వేలు ఇస్తామని చెప్పి.. ఇవ్వలేదు. కౌలు రైతులకు రూ.15వేల ఆర్థిక సాయం లేదు. విద్యార్థులకు రూ.5 లక్షలు ఇస్తామని చెప్పి మోసం చేశారు. భాజపా ప్రభుత్వం రిజర్వేషన్లు రద్దు చేస్తుందంటూ కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోంది. నా వీడియోను ఎడిట్ చేసి తప్పుడు ప్రచారం చేశారు. కాంగ్రెస్ వస్తే.. మళ్లీ ఆర్టికల్ 370ని పునరుద్ధరిస్తారు" అని అమిత్ షా అన్నారు.

## పాలనను మరచి కేసీఆర్‌ను తిట్టడానికి పోటీపడుతున్నారు - సబితారెడ్డి

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంలోని మం త్రులు పాలనను మరచి కేవలం కేసీఆర్‌ను తిట్టడానికి పోటీపడుతున్నారని మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను గెలిపించాలని కోరుతూ ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్‌లో రోడ్‌షో నిర్వహించి కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తల బలంతో మహేశ్వరం నియోజకవర్గాన్ని కంచుకోటగా మార్చామని అన్నారు. ప్రభుత్వంలో ఉంటేనే పనిచేయాలని ఏమీ లేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా కొట్లాడి పనిచేయించే శక్తి ప్రజలు తనకిచ్చారన్నారు. పాలకులు పాలనను గాలికి వదిలేసి కేవలం కండువాలను కప్పడానికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆమె విమర్శించారు. కాంగ్రెస్ మోసపూర్తి వాగ్దానాలను ఇచ్చిందని ప్రజలకు తెలిసిపోయిందన్నారు. కేసీఆర్ పాలన కావాలంటే కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ రోడ్‌షోలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, ఆర్‌కేపురం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, ఇంటూరి అంకిరెడ్డి, సాజిద్, శ్రీనివాస్, మల్లేష్, రిషి పాల్గొన్నారు.

ప్రభాత
సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194



## తెలంగాణకు వచ్చి నీతులు చెబుతున్నారు.. మోదీపై వీహెచ్ ఫైర్

హైదరాబాద్, మే 11: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి నీతులు చెబుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు మండిపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఇండియా కూటమికి మోదీ భయపడుతున్నారన్నారు. రజాకార్ల పాట ఎన్ని రోజులు పాడతారని అన్నారు. రజాకార్లు ఉన్నప్పుడు బీజేపీ ఎక్కడుందని ప్రశ్నించారు. అదానీ, అంబానీలకు మాత్రమే మోదీ న్యాయం చేశారని విమర్శించారు. మోదీ ఏమైనా అమితాబ్ అనుకుంటున్నాడా? షారూఖ్ అనుకుంటున్నాడా? అంటూ ఆయన ఎద్దేవా చేశారు. మణిపూర్‌లో మహిళల బట్టలు విప్పి నడిపిస్తే మోదీ మాట్లాడారా అని ప్రశ్నించారు. కులగణన చేస్తామని 2008లో బీజేపీ నాయకులు అన్నారని... ఇప్పటిదాకా చేయలేదన్నారు. గుజరాత్‌లో ముస్లింలను ఊచకోత కోశారన్నారు. "నా పేరే హనుమంతుడు. నేను రాముడి భక్తుడిని. నేను సచ్చేదాకా కాంగ్రెస్‌లోనే ఉంటా. కాంగ్రెస్ పార్టీ కోసమే పనిచేస్తా" అని వీహెచ్ స్పష్టం చేశారు.

## 'ఈటల'కు మద్దతు ప్రకటించిన వీర శైవ లింగాయత్‌లు



మల్కాజిగిరి(హైదరాబాద్): మల్కాజిగిరి నియోజకవర్గంలో వీరశైవలింగాయత్‌లు తమ మద్దతును బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ప్రకటించారు. ఈ మేరకు వీరశైవలింగాయత్ సమాజం అధ్యక్షుడు ఆలూరే ఈశ్వర ప్రసాద్ మల్కాజిగిరిలోని తన నివాసంలో వీరశైవలింగాయత్‌లతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుభవజ్ఞులు, ప్రజల మనిషి, సమస్యల పరిష్కారంలో అనుభవం కలిగిన ఈటల రాజేందర్‌కు తమ సమాజం పూర్తి మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు.

నియోజకవర్గంలో సుమారుగా మూడు వేల కుటుంబాలు ఉంటాయని, ఈ మూడువేల కుటుంబాలు సైతం బీజేపీకి పూర్తి మద్దతుగా తెలుపుతామని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ముచ్చటగా మూడోసారి ప్రధానిగా కాబోతున్నారని, కేంద్రంలో బీజేపీ ప్రధానిగా మోదీ సర్కార్ ఉంటేనే దేశపురోభివృద్ధిని సాధిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పలువురు లింగాయత్‌లు పాల్గొన్నారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660